నా జీవ నావ యాత్ర

శ్రీమతి డి. రాజేశ్వరమ్మ గారు

ఆహా! పరమాత్మునిచేత లత్యద్భుతములుగదా! మొన్న మొన్నటివరకు సౌఖ్యాంబుధి నోలలాడ నువ్విళ్లూరుచుండ దైవమంతలో నాయాశల కంతరాయమును గల్పించెను? సర్వసుఖముల కునికిపట్టగు ఈ ఎల్లప్రాయమంతయు బూడిదలో పన్నీరువలె వ్యర్థముకావలసినదేగదా? స్త్రీ ఎవ్వనిదైవమని భావించునో, ఎవ్వనిగూడి ధర్మార్థకామమోక్షమార్గములను బడయునో, అట్టి అనుకూలవర్తియు అవిరళమగు దాంపత్యసుఖముల నోలలాడించు పతియులేని సతియొక్క జీవనము—అడవిఁగాచిన వెన్నెలవలె—దివాకరుఁడులేని దివసమువలె—రాజులేని రాజ్యమువలె—వ్యర్థమేగదా?

చదువరీ! నా యీదుఃఖపూరితమగు జీవచరిత్రమును వ్రాసి మిమ్ము శ్రమ పెట్టుచున్నందులకు మన్నింపుడు. మా కాపురస్థలము (అనగా నాజన్మభూమి) మానేపల్లి అగ్రహారమని పూర్వకాలపు టుత్తరప్రత్యుత్తరములనుబట్టి నిర్ధారణ చేసితిని. తలిదండ్రులకు దురదృష్టవతినగు నే నేకపుత్రికనగుటఁజేసి చిన్ననాటనుండియు గారాబమున బెరిగితిని. బాల్యావస్థయను అజ్ఞానాంధకారముచే గప్పబడియుండుటచే నాచిన్ననాటి మాస్థితిగతులను వివరించుట నాకసాధ్యము. నాకారేండ్లు రాకపూర్వమే మాతృవియోగము సంభవించినది. నాజనకుఁడు నిర్భరవిచారమునకు లోనయ్యెను. కొలది కాలమైన తరువాత మే మిరువురము మానేపల్లి అగ్రహారమును వీడి తత్సమీపముననుండు మచిలీపట్టణమును జేరితిమి. అదృష్టదేవత మమ్మాదరించెనో యన అచ్చట నాజనకుని కొక చిన్న యుద్యోగము లభించెను......నెలలు, సంవత్సరములు గడచెను. నాకు వయసు మీరుటచే విద్య మానవలసివచ్చినది—పాఠశాలకేగుట మానితిని—అనంతరము మానాన్నగారు నావివాహమునకై వరాన్వేషణమున నిమగ్నులై మిగుల ప్రయత్నపూర్వకముగ పాటుపడుచుండిరి. అతని ప్రయత్నములన్నియు విఫలములయ్యెను. వరశుల్క-వ్యాఘ్రములు దేశమున

విరివిగ వ్రిరపీగుచుండుటచే నాజనకుఁడు విఫలమనోరథుడయ్యెను. మాకు దగ్గర బంధువు నాజనకుని కాంతరంగికస్నేహితుడును అగు మాధవరావుగారి పుత్రుడగు రంగారావునకిచ్చి నన్ను పెండ్లిచేయవలెనని నాజనకుని మనోగతము. కాని అది సమకూఱు టెట్లు? అందని మ్రానిపండున కఱ్ఱులు చాచినట్లు మామనోగతములు మితిమీరియుండెను. రంగారావును, నేనును చిన్ననాటనుండియు మనోభావములందైన నేమి, అన్యోన్యమైత్రియుండెను ఒకరినొకరు వ్యతిరేకించక—ఆశాలతను పెంపొందింప ప్రయత్నించుచుంటిమి—మానాన్న పూర్వాచారపరాయణతకు లోనగుటవలన, నాకెనిమిది తొమ్మిదేండ్లు రాకపూర్వమే పాఠశాలలోని నాచదువును మాన్పుటచేత మాకిరువుర కెడబాటు సంభవించినది. రంగారావు మాతృవియోగమున నున్న నన్నుజూచి చాలజాలిపడుచుండెను. ప్రతిదినమును అధమపక్ష మొక్కసారియైనవచ్చి నన్ను దర్శించుచుండెడివాడు.

మాధవరావునకు మడిమాన్యములు విరివిగనున్నను లోభదేవతకు నాతడు లోనయ్యెను. అప్పటిపరిస్థితులనుబట్టి ధనాశచే పీడింపబడి విలువయగు కట్నమిచ్చిన తన పుత్రునికి వివాహమొనర్తునని ఆతఁడు ప్రకటించుచుండెను. మేమంతధన మొసంగుటకసమర్థులమగుటచే మాయాశలడుగంటెను. రంగారావు రాజమహేంద్రవరమున బి. యె. క్లాసు జదువుచుండెను. ఆతనివయస్సప్పటికి ఇరువదికికంటె మించియుండదు. ఇన్నియేల? ఆతని లావణ్యరూపనవయోవిలాసములు—సిగ్గువీడి జెప్పుచున్నాను—నన్ను మిక్కిలి భ్రమింపజేసినవి. ఒకనాటి సాయంసమయమున నొంటరిగ నాచెంతకేతెంచి ఆతడు నిశ్చేష్టుడై యశ్రులు జలజలరాల్చెను. నేనేమియు నెఱుగమి యాశ్చర్యమున నాతని వంకజూచితిని.

"లక్ష్మీ! మనయాశ లడుగంటెను—నన్నిక మరచిపొమ్ము." అన్నాడు. అంతట మాయింటికెవరో వచ్చుచుండినట్లు చప్పుడు వినబడ వెనుకకు దిరిగి జూచితిని. మానాన్న నన్ను లోపలినుండి బిలచెను—రంగారావు స్వగృహ మంధకారమున లీనమయ్యెను. మరి నాకగపడలేదు—అంత నేను లోనికేగితిని—చిట్టచివరకు మూడవపెండ్లి చేసికొనను వువ్విళ్లూరుచున్న ముదుసలిపెండ్లికొడుకు స్వల్పశుల్కమునకే కుదురుటచే మానాన్నగారు ఆసంబంధమును చేయుట కుద్యుక్తులైరి. నీమనోగతమేమని నన్నడుగ నేనపుడు ముగ్ధనై లజ్జచేతాడితనై మౌనముదాల్చి ప్రత్యుత్తరమీయజాలకపోతిని. మౌనమర్ధాంగీకారమని గాబోలు మానాన్న వివాహమునకు నిశ్చయించెను. ఇప్పుడు దురంత

దుఃఖముల పాలుగావలెనని నొసట వ్రాసియుండ అప్పుడేల మనోగతమును వెల్లడింపకుందును? ఆహా! మానము ముగ్ధాంధ్ర మనోగతమున కంతరాయ మిట్లేగదా గల్పించును? అని దలచుకొని దుఃఖించితిని. నన్ను దుఃఖవార్ధిని బడద్రోసి యౌవన సౌఖ్యమునకు దూరముగ జేయుసమకట్టిన వివాహదినమునకు మరి రెండురోజులే గడువుండెను......రంగారావుపేర రాజమహేంద్రవర మొకజాబును వ్రాసితిని. జవాబు రాలేదు. వివాహమెట్లో సమాప్తినొందినది. నెలరోజులైనది. మాయత్తవారింటినుండి పెండ్లికొడుకు జీవనము నిరాశను సూచించుచు జబ్బుచే బాధపడుచున్నట్లు జాబు వచ్చినది. మరియొక వారము గడచినంత ముదుసలి మృతినొందెనని మరియొక జాబువచ్చినది. భయంకరమగు వైధవ్యపిశాచము నన్నావరించినది. అయ్యో! మఱివ్రాయ చేతులాడకున్నవి. నాయాశాచంద్రు డంతలో నస్తమించెను! నాసౌభాగ్య మంతయు శూన్యమయ్యెను. వరశుల్కవ్యాఘ్రము నాకుత్తుకబట్టి నొక్కినది. ఈజన్మమున హా! నా కిక విముక్తిలేదు. నాజీవననావ మునుగనున్నది!—మునిగినది—ఓసంఘసంస్కర్తలారా? జాతీయనాయకులారా! చూచుచు నూరకుండెద రేల? ముక్కుపచ్చలారని బాలికలపాలిట బ్రహ్మరాక్షసివలె వేచియున్న వరశుల్కవిపణిని నిర్మూలముచేసి దేశము నుద్ధరింపదలచు ధీరుడేడి? ......నేనింకను పుష్పవతినిగాకపూర్వము కొందఱు నాదీనావస్థనుజూచి బ్రహ్మసమాజమతమును బురస్కరించుకొని పునర్వివాహము జేసికొన సలహాల నిచ్చిరి. వారికందరకు కృతజ్ఞతాపూర్వకముగ వందనము లర్పించితిని. నాజనకుని హితవాక్యముల ననుసరించుచు పూర్వాచారపరాయణతకు కళంక మాపాదింప నేనించుకైనను నిష్టపడలేదు.

దురదృష్టదేవత ఆవేశించెనో యన నాజనకుడు నావలని మనోవేదనయను దీర్ఘరోగమునకు లోనయ్యెను. దినదినమునకు క్రమమున కృశించుచుండెను. ఆతని క్షేమమునుగోరుచు దయామయుడగు పరమాత్ముని పరిపరివిధముల బ్రార్థించుచు అబలనైనను ధైర్యము వహించి పురుషత్వమునుబూని రోగమని భావించి వైద్యులచే మందుల నిప్పించితిని గాని ఇంచుకైన లాభము లేకపోయెను. గోరుచుట్టుపై రోకటిపోటు. నాజనకుడు నన్ను దురంతమగు కష్టములపాలు జేసి కీర్తిశేషుడయ్యెను. నాటి నుండియు ఈ మిథ్యాప్రపంచమున—దిక్కుమాలిన దానను—ఉండుటకాశ్రయ మైనను లేదుగదా! భగవంతుడెన్నడు నావంటి దిక్కుమాలిన ముగ్ధలను అదృష్టహీనలను సృష్టింపకుండుగాక!

నాకు ప్రపంచమంతయు నంధకారముగ దోచెను. పిశాచములు పట్టి పీకుచుండెను. అధైర్యదేవత హృదయమున తాండవమాడుచుండెను, దారిద్ర్యదేవత దర్శనమొసగెను. నాయాశలన్నియు పటాపంచలై పోయినవి.

అయ్యో! ఈప్రపంచమున మఱిజీవించుట కాధారము లేదనుకొంటిని. "బలత్కారప్రాణవిసర్జనమే కర్తవ్యము" అని దలచితిని. అనంతరము జ్ఞానసూర్యు డుదయించెనో యన ఛీ! ఛీ! లోకసౌఖ్య మిట్లంతరించినను పరలోకసౌఖ్యము ప్రాణపరిత్యాగముచేసి పరిత్యజింపదగునా? యనుసంశయము బొడమెను. ధైర్యమును బూనితిని. స్త్రీలకుసహజమగు లజ్జనంతయు నొక్కసారి పాఱద్రోలితిని. కాషాయాంబరములచేతను, విభూతిచేతను, రుద్రాక్షమాలచేతను నాయీపాపకర్మపుబొందె నలంకరించితిని. ఇహపరములకు మోక్షమార్గదర్శనియగునట్టియు, సర్వపాపహరణమగునట్టియు కాశీక్షేత్రమున కేగితిని. విశ్వనాధుని వినయవిధేయతల వేడుకొంటిని—

"నిరతము నిన్నే నమ్మియుంటిరా—నీలకంఠ! వరద!
యనాథలగు నాబోటియువిదలకు—నాశ్రయమియ్యవె మదనహర!"

అని భక్తిచే కన్నులుమూసి కరములుమోడ్చి కాపాడుమంటిని. కాంతివంతమగు నొక దీపకళిక కన్నులఎదుట మెఱసెను. కన్నులు విప్పిచూడ నాశిరముపై నొక పుష్పము రాలెను. ఆకుసుమము దీసి కన్నుల కద్దుకొంటిని. నాజన్మసాఫల్య మయ్యెననుకొంటిని... పరమేశ్వరునిచెంత కాశిలో దాసినై సర్వకాలవాసినినైతిని.

ముద్దుకృష్ణ

గంటి లక్ష్మీనారాయణ గారు

నెమలిపింఛంబు ఫాలభాగమున మెఱయ గంధవహునితో జేలంబు కలసియాడ
ముంగురులు ముద్దుమోమున ముసరియాడ నెమరులన్నాని గోతతి నిలచియుండ
చిఱునగవు వక్త్రసీమను చిందులాడ మించువేడుక మురళి వాయించుకృష్ణ
తారహారముల్మేనిని తళుకునింప మన్మనోనాథ! నిన్నెట్లు మఱతునోయి